క్లుప్తంగా

కమిషనర్‌కు సన్మానం



ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ స్వచ్ఛ పురస్కారం సాధించిన నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీ గంగాప్రసాద్‌ను పలువురు శాలువాలతో సోమవారం ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, సూరా భాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, పెంచలయ్య, నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, నున్నా సంతోష్‌కుమార్, వెంకటసుబ్బానాయుడు, పులిమి శైలజారెడ్డి, చిన్నపరెడ్డి, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయుల విధుల్లో చేరిక

ఉదయగిరి రూరల్/సీతారామపురం/వరికుంటపాడు: డీఎస్సీ ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. ఉదయగిరి మండలానికి ఇద్దరు ఎస్జీటీలు, 32 మంది స్కూల్ అసిస్టెంట్లను కేటాయించగా అందరూ విధుల్లో చేరారు. అలాగే సీతారామపురం మండలానికి 18 మందిని కేటాయించగా 17 మంది విధుల్లో చేరారు. నూతన ఉపాధ్యాయులను ఉదయగిరి , సీతారామపురం ఎంఈఓలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు, మస్తాన్‌వలి అభినందనలు తెలిపారు. అలాగే వరికుంటపాడు ఎంఈఓలు కొండయ్య, రమణయ్య నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

చికెన్ దుకాణాల తొలగింపునకు అంగీకారం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బంగ్లా సెంటర్ సమీపంలో ఇరిగేషన్ స్థలంలోని చికెన్, మటన్ షాపులను తొలగించేందుకు వ్యాపారులు అంగీకరించారు. సోమవారం ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులు చికెన్ షాపు నిర్వాహకులతో సంప్రదింపులు జరిపారు. దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలం కేటాయిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వ్యాపారులు అంగీకరించారు. కాగా బంగ్లాసెంటర్‌లో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న చికెన్ దుకాణాలను తొలగిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుంది.


18న వర్మికంపోస్టు తయారీపై శిక్షణ

సీతారామపురం : నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం ఈ నెల 18న వర్మికంపోస్టు తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు, యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7981 644675 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

రీసర్వే పరిశీలన



సీతారామపురం : దేవమ్మచెరువులో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను ఆత్మకూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి శ్రీనివాస్‌శర్మ సోమవారం పరిశీలించారు. రైతులు ఇబ్బందులు పడకుండా రీసర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు. సర్వేయర్లు శ్రీకాంత్, నిఖిల్, రాజేంద్ర, వీఆర్వోలు వెంకట్, బాలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

- ఒకరికి తీవ్ర గాయాలు

దగదర్తి: దగదర్తి ఎస్సీ కాలనీలో ఇద్దరు యువకుల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..ఎస్సీకాలనీలో మంద వేణు, తక్కిడి మనోహర్ పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి వారు స్నేహితులతో కలిసి మద్యం సేవించారు. అనంతరం ఇద్దరూ కలిసి ఇంటికి వచ్చారు. ఆ తరువాత పాత గొడవల నేపథ్యంలో ఇద్దరి మధ్యన ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో మనోహర్ ఇనుప రాడ్డుతో వేణు తలమీద దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వేణును నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

17న కర్రతుమ్మచెట్ల వేలం

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలోని యర్రబల్లిపాళెం, పాతూరు చెరువుల్లోని కర్రతుమ్మ చెట్ల వేలం ప్రక్రియను ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ మహేంద్ర సోమవార తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 17న ఉదయం రూ.10 వేలు దరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాలి



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ నాయకుల ఆందోళన

ఉదయగిరి: అమాయక ప్రజల ప్రాణాలను తీస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నకిలీ మద్యంపై ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం కార్యాలయం ఎదుట ఫ్లకార్డులు చేతబట్టి నకిలీ మద్యంపై ఆందోళన చేపట్టారు. ఆ తరువాత ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాసరావుకు వినతి పత్రాలు అందజేశారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యంపై అసత్య ఆరోపణలు చేసిన టీడీపీ ముఖ్యనేత అధికారంలోకి రాగానే నకిలీ మద్యానికి దారులు తెరిచారని ఆరోపించారు. తమ పార్టీ అనుచరుల ద్వారా నకిలీ మద్యాన్ని తయారీ చేయిస్తూ విచ్చలవిడిగా వ్యాపారం చేస్తూ పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బయటపడిన నకిలీ మద్యం దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిందని తెలిపారు. కల్తీ మద్యాన్ని బెల్ట్‌షాపుల ద్వారా అమ్ముతూ ప్రజల ప్రాణాలతో ఆడకుంటూ రూ.కోట్లు కొట్టేస్తున్నారని ఆరోపించారు. ఉదయగిరి నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు లేని గ్రామం లేదన్నారు. ప్రతి ఊరులో రెండు లేదా అంతకంటే ఎక్కువ ఉన్నాయన్నారు. కొన్ని గ్రామాల్లో పది షాపులు ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నకిలీ మద్యం తాగి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. నకిలీ మద్యం వెనుక ఉన్న పెద్దల పాత్రపై సీబీఐ విచారణ చేయించి నిజాలు బహిర్గతం చేయాలన్నారు. మద్యం విధానంపై ప్రభుత్వ వైఖరి మారనంత వరకు తమ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, మండలాధ్యక్షులు కొండా రాజగోపాల్‌రెడ్డి, కాటం రవీంద్రరెడ్డి, డీ వాసుదేవరెడ్డి, రేవునూరి శ్రీనివాసరెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు దేగా వంశీ, నాయకులు బయ్యపురెడ్డి విజయ్‌రెడ్డి, కే రమణారెడ్డి, వీరారెడ్డి, సర్పంచ్ సుబ్బరాయుడు, సలీం, దస్తగిరి అహ్మద్, శ్రీనివాసరెడ్డి, సుందరం శనివారపు వెంకటేశ్వర్లు, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఎఫ్‌ఏ–2ను పకడ్బందీగా నిర్వహించాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్‌ఏ–2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ–2 తోటా శ్రీనివాసులు అన్నారు. మండలంలోని గడ్డంవారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన ఉపాధ్యాయులను పరిచయం చేసుకుని సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న ఎఫ్‌ఏ–2 పరీక్షల నిర్వహణను పరిశీలించి హెచ్‌ఎం మాలకొండయ్యకు సూచనలు చేశారు. పదోతరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

ఆడబిడ్డలను రక్షించుకుందాం



కలిగిరి:అవగాహన కల్పిస్తున్న వెంకటసుబ్బయ్య



ఏఎస్‌పేట: అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

కలిగిరి: ఆడబిడ్డలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య తెలిపారు. కలిగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భ్రూణ హత్యలు, లింగ వివక్ష, పీసీపీఎన్ డీటీ చట్టం, సుకన్య సమృద్ధి యోజన, బేటి బచావో..బేటీ పడావో, ఆడపిల్లల సామాజిక విద్య, రాజకీయ రంగాల్లో ఉన్న హక్కులను విద్యార్థినులకు వివరించారు. ప్రిన్సిపల్ సుజన, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది నరసయ్య, నారాయణ, మేరి, నాగమణి పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: ఆడ బిడ్డలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కేజీబీవీ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి అన్నారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కేజీబీవీలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, భ్రూణహత్యలు, లింగ వివక్ష, బాలికల హక్కులు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



బాణసంచా దుకాణాన్ని తనిఖీ చేస్తున్న చేజర్ల ఎస్సై తిరుమలరావు

ఉదయగిరి/చేజర్ల(సోమశిల)/సంగం: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఉదయగిరి, చేజర్ల, సంగం ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, తిరుమలరావు, రాజేష్ తెలిపారు. ఉదయగిరి, చేజర్ల, సంగం పోలీసు స్టేషన్లలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బాణసంచా వ్యాపారులు బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలకు సంబంధించి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. జన సంచారం తక్కువగా ఉండే విశాలమైన ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు దుకాణాల వద్ద నీటి డ్రమ్ములు, పొడి ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బాణసంచా దుకాణాలను తనిఖీ చేశారు.

నేడు ఉపాధి ప్రజావేదిక

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదికను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024 ఏప్రిల్ 30 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీ చేసి గుర్తించిన అవకతవకలను ప్రజావేదికలో చదివి వినిపించనున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలు, సిబ్బంది, ప్రజలు హాజరై తమ అభ్యంతరాలు తెలియజేయలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.326 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 1034 బేళ్లను తీసుకురాగా, 704 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా రూ.69, సరాసరిన రూ.220.87 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ వివరించారు.

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 817 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1290 బేళ్లు రాగా, 817 బేళ్లను విక్రయించామని చెప్పారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా రూ.69, సగటున రూ.171.05 ధర పలికిందని వివరించారు.

వాహనాల తనిఖీ

సంగం: పెరమన వద్ద జాతీయ రహదారిపై సంగం సీఐ వేమారెడ్డి సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

ఎంపీడీఓకు వినతి

ఆత్మకూరురూరల్: ఐదేళ్లు దాటిన పేద కుటుంబాలకు చెందిన చిన్నారుల పేర్లను ఆరోగ్య శ్రీ కార్డుల్లో చేర్పించాలని మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తోడేటి అశోక్ కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పఠాన్ రఫీఖాన్‌ను సోమవారం వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిరుపేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం ప్రయోజనాలు దూరమవుతున్నాయని విన్నవించారు.

చేపల గుంతలతో మునిగిపోతాం

- చేపల సాగుకు అనుమతులు ఇవ్వొద్దు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

సంగం: వంగల్లు, తరుణవాయి గ్రామాల్లో మళ్లీ చేపల గుంతల సాగుకు మత్స్యశాఖ అధికారులు భారీగా ముడుపులు తీసుకుని అనుమతులు ఇచ్చినట్లుగా తెలిసిందని, మళ్లీ చేపల సాగుచేపడితే వరి పంట దెబ్బతిని నష్టపోతామని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపల గుంతల సాగుకు అనుమతులు ఇవ్వవద్దంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సోమ్లానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ గ్రామసభలను ఏర్పాటు చేసి చేపల ప్రజాభిప్రాయం మేరకు గుంతలకు అనుమతి ఇవ్వాలా..వద్దా అనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు మీడియాతో మాట్లాడారు. గతంలో తమ గ్రామాల పరిధిలో సుమారు 300 ఎకరాల్లో అనధికారికంగా చేపల చెరువుల ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పట్లో చేపల గుంతల నుంచి వచ్చే వృథానీటి కారణంగా పంట పొలాలు దెబ్బతిని ఎందుకు పనికి రాకుండా పోయాయన్నారు. పంటలు సరిగా పండక పోవడంతో జిల్లా ఉన్నతాధికారులను కలిసి తమ బాధను మొరపెట్టుకోగా తొలగించారన్నారు. ఆ తరువాత మళ్లీ చేపల గుంతల సాగు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం కొందరు మళ్లీ చేపల గుంతల ఏర్పాటుకు మత్స్యశాఖ అధికారుల వద్ద అనుమతులు తీసుకున్నట్లుగా తెలిసిందన్నారు. గతంతో రైతులు ఎన్నో పోరాటాలు చేయడం అధికారులు చేపల గుంతలను తొలగించారని, మళ్లీ మత్స్యశాఖ అధికారులు మామూళ్ల మత్తుతో అనుమతులు ఇవ్వడం తగదన్నారు. మళ్లీ చేపల గుంతలను ఏర్పాటు చేస్తే సుమారు 500 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్న రైతులు పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చేపల గుంతల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకుండా చూడాలని కోరారు.

పంట పొలం మునిగిపోతుంది



నాకు ఎకరా పంట పొలం ఉంది. చేపల గుంతలను ఏర్పాటు చేస్తే పొలం పూర్తిగా మునిగిపోతుంది. దాని మీద ఆధారపడిన నా కుటుంబం కష్టాలకు గురవుతుంది. అధికారులు స్పందించి చేపల గుంతలు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దు. – తురకా పుల్లయ్య

పంట పొలాలకు తీవ్ర నష్టం



నాకు నాలుగు ఎకరాల్లో పంట పొలం ఉంది. చేపల గుంతలను ఏర్పాటు చేస్తే వాటి నుంచి వచ్చే నీటితో పంట పొలం దెబ్బతింటుంది. వరి పంట సైతం దెబ్బతిని పూర్తిగా నష్టపోతాం. – గోతం శ్రీనివాసులు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



గతంలో తరుణవాయిలో అక్రమంగా ఏర్పాటు చేసిన చేపల గుంతలతో వందలాది ఎకరాలు మునిగిపోవడంతో తొలగింపునకు పెద్దఎత్తున పోరాటం చేశాం. మూడేళ్ల క్రితం పూర్తిస్థాయిలో చేపల గుంతల ఎత్తివేతకు అధికారులు పూనుకోవడంతో ప్రస్తుతం పంటలు సాగు చేసుకుంటున్నాం. మళ్లీ మత్స్యశాఖ అధికారులతో కొందరు నాయకులు కుమ్మక్కై చేపల గుంతలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలిసింది. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. – దేగా కృష్ణయ్య, తరుణవాయి

పద్మనాభరెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటు



పద్మనాభరెడ్డి మృతదేహంపై వైఎస్సార్‌సీపీ జెండాను కప్పి నివాళులర్పిస్తున్న నాయకులు

కావలి(అల్లూరు): వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలవల్లి పద్మనాభరెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కావలిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాటంరెడ్డికి ప్రధాన అనుచరుడైన పద్మనాభరెడ్డి అకాల మరణం చెందారు. పట్టణంలోని వైకుంఠపురంలోని నివాసంలో ఉంచిన పద్మనాభరెడ్డి భౌతికకాయాన్ని సోమవారం వారు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పద్మనాభరెడ్డి స్నేహశీలి, మృదుస్వభావి అన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆలోచించే ఆయన రోడ్డుప్రమాదంలో అకాల మరణం చెందడం వ్యక్తిగతంగా తనకు చాలా లోటుగా ఉందన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి తనతో ప్రమాణం చేసిన వ్యక్తి ఈ రోజు లేకపోవడం ఎంతో బాధాకరంగా ఉందన్నారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. కాగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరెడ్డి, నాయకుడు వెంకటశేషయ్య, తదితరులు పద్మనాభరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించి అంత్యక్రియలను నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేత్రదానం

రోడ్డు ప్రమాదంలో మరణించిన పద్మనాభరెడ్డి నేత్రాలను ఆయన సతీమణి పాలవల్లి మాధవి, కుమార్తెలు లిఖిత, తనుజ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ నేత్రాలను సేకరించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఆత్మకూరురూరల్: ఎరువులు, పురుగుమందులను రైతులకు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ దేవసేనమ్మ హెచ్చరించారు. ఆత్మకూరులోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లలో నమోదు చేయని రూ.34,400 విలువైన స్టాకును విక్రయించకుండా నిలిపివేశారు. ఆమె వెంట ఏఓ కిషోర్‌బాబు ఉన్నారు.

ఉదయగిరి/మర్రిపాడు: ఉదయగిరి, మర్రిపాడులోని ఎరువుల దుకాణాలను కావలి ఏడీఏ నాగరాజు సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. అనుమతి లేని ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. పలువురు వ్యాపారులు బిల్లు పుస్తకాలు నిర్వహించకపోవడాన్ని గుర్తించి హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు, బిల్లులు లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓలు కవిత, విజయభాస్కర్ పాల్గొన్నారు.

అల్లూరు రోడ్డు వద్ద సూచిక బోర్డులు లేక..



డివైడర్ పైకి దూసుకెళ్లిన మరో లారీ



బోల్తాపడిన మినీ లారీ

- అదుపుతప్పి మినీలారీ బోల్తా
- డివైడర్‌ను ఢీకొన్న మరో లారీ
- పొలాల్లోకి దూసుకెళ్లిన కంటైనర్

దగదర్తి: మండల పరిధిలోని అల్లూరు రోడ్డు వద్ద రైల్వే వంతెనపై జాతీయ రహదారి రెండు లేన్లు మాత్రమే ఉండడం..సూచిక బోర్డులు కనిపించే విధంగా లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సోమవారం కావలి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీలారీ రైల్వే వంతెన సమీపంలో మార్జిన్‌లో ఏర్పాటు చేసిన రాళ్లను ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొద్దిసేపటి తర్వాత మరో లారీ మార్జిన్‌లో ఏర్పాటు చేసిన రాళ్లను ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లింది. అంతలోనే మరో కంటైనర్ డ్రైవర్ రోడ్డుపై బోల్తాపడిన లారీని దగ్గరికి వచ్చిన తర్వాత గమనించి బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. సమాచారం అందుకున్న దగదర్తి పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. కాగా అత్యంత ప్రమాదభరితంగా ఉన్న ఈ ప్రాంతంలో హైవే అధికారులు ఎటువంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా హైవే అధికారులు, పోలీసులు స్పందించి ఈ ప్రాంతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సంగం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజేష్



ఆత్మకూరు: అవగాహన కల్పిస్తున్న సీఐ గంగాధర్

ఆత్మకూరు: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరుకు సీఐ ఎం గంగాధర్ అన్నారు. పట్టణంలోని బీసీబాలుర వసతి గృహంలోని విద్యార్థులకు సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, సెల్‌ఫోన్ వినియోగంతో అనర్థాలపై సోమవారం ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

సంగం: మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్సై రాజేష్ సోమవారం అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి విశేష పూజలు



సంగం: పరమేశ్వరుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సంగంలోని తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి జ్ఞానపీఠంలో కాశీవిశ్వేరుడికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత పెన్నానది జలాలతో అభిషేకం చేశారు. అనంతరం పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష పూజలు జరిపారు. ఆ తరువాత లలితా రుద్ర మహాయజ్ఞానాన్ని నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీ



ఆత్మకూరు: పట్టణంలో జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జీఎస్టీ 2.0 వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. బస్టాండ్ వద్ద లేబర్ ఆఫీసర్ రమేష్ నాయుడు మాట్లాడుతూ జీఎస్టీ 2.0పై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. పాత జీఎస్టీ పోల్చితే కొత్త జీఎస్టీతో వస్తువుల ధరలు బాగా తగ్గుతాయని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

పొగాకును పరిమితి మేరకు పండించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు రైతులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. 2025–26 పంట కాలనికి సంబంధించి పొగాకు పంట నియంత్రణ ఆవశ్యకతపై వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ అవగాహన కల్పించారు. 2025–26 పంట కాలానికి బ్యారెన్‌కు 2.90హెక్టార్ల (7.25ఎకరాలు)లో 3665 కిలోలు పండించడానికి పొగాకు బోర్డు అనుమతించిందని తెలిపారు, ప్రతి రైతు పొగాకు బోర్డు అనుమతించిన పరిమితిలోనే పంటను సాగు చేయాలని సూచించారు.